ముడుపు

హోతా పద్మినీదేవి

"ఈ ఏడాది శ్రీరామ నవమికి కళ్యాణం మనం చేద్దామండీ" అంది శ్రీమతి భోజనం వడ్డిస్తూ. తన కేదైనా ఆపద వాటిల్లినప్పుడో, ఏదైనా కోరిక కలిగినపుడో ఆపద తీవ్రతను, కోరిక స్థాయిని బట్టి కొబ్బరికాయ నుంచి కొండ యెక్కి వస్తాననడం దాకా మొక్కుకోడం నా శ్రీమతికి రివాజు. ఈసారి కళ్యాణం చేస్తాననగానే ఏదో పెద్ద కోరికే కోరుకుందన్నమాట అనుకుంటూ, అడిగాను.

"కళ్యాణమే! ఏం మొక్కుకున్నావేమిటి?"

"అబ్బాయి పెళ్లికి ఒప్పుకుంటే, కళ్యాణం చేయిస్తానని మొక్కుకున్నాను."

మా ఏకైక పుత్రుడు వరప్రసాద్‌కి పెళ్లి పట్ల విముఖత్వమూలేదు. పెళ్లి వయసూ దాటిపోలేదు. అలాంటిది వాడి పెళ్లి కోసం మా ఆవిడకి ఎందుకంత ఆరాటమో అర్థం కాలేదు నాకు.

"బాగుంది అబ్బాయి పెళ్లికోసం దేముడి కళ్యాణం చేయిస్తావన్నమాట" అన్నాను కాస్త అసంతృప్తిగా, మనసులో ఎంత ఖర్చవుతుందో అంచనా వేస్తూ.

"పంచప్రాణాలూ వాడిపైనే పెట్టుకుని బ్రతుకుతున్నాను. వాడు పెళ్లి చేసుకుని, పిల్లపాపలతో కళ కళలాడుతూ వుండాలనే నా ఆశ నేను బ్రతికి వుండగా తీరుతుందనుకోలేదు. అంతా ఆ ఏడుకొండల వాడి దయ" అంది భక్తిగా చేతులు జోడిస్తూ.

"శ్రీరామ కళ్యాణం అన్నావుగా! మళ్లీ ఏడుకొండలవాడి దయ అంటావేమిటి?" అన్నాను కాస్త కంగారు పడి మళ్లీ తిరుపతిలో కూడా కళ్యాణం అంటుందేమోనని.

"కంగారు పడకండి నేను మొక్కుకున్నది శ్రీరాముడికే, శ్రీనివాసుడికి కాదు" అంది నా మనసు గ్రహించినట్టు చిరుకోపంగా.

"సరే! ఏ దేముడి దయవల్లనైతేనేం అబ్బాయి పెళ్లికి ఒప్పుకున్నాడుగా. నీ మనసులో కోరిక నెరవేరాక మొక్కు తీర్చకపోతే, శ్రీరామ చంద్రమూర్తి వూరుకున్నా నువ్వు వూరుకోవు" అన్నాను.

శ్రీమతి ఉత్సాహంగా నాలుగు మూలలా పసుపు రాసిన ఒక కాగితం మడతని నాకు అందించింది.

"ఇదుగో! కళ్యాణానికి కావలసిన సామాన్లలిస్టు. అవధానిగారు యిచ్చారు."

మడత విప్పి చదవడం మొదలు పెట్టాను.

మంగళసూత్రాలు

మెట్టెలు

ఉత్తరజంధ్యాలు

మధుపర్కములు చదువుచుండగానే శ్రీమతి అందుకుంది.

"మంగళసూత్రాలు ఓ పావుకాసులో చేయిద్దామండీ! మరీ చిన్నవైతే నలుగురిలోనూ ఏం బాగుంటుంది?"

"సరే" అన్నాను.

"కళ్యాణం రోజున మన బంధువుల్ని నలుగురిని పిలిచి భోజనం పెడదామండీ!"

"దేముడి పెళ్లికి అందరూ పెద్దలే అన్నట్టు మనకి ఊరంతా బంధువులే! కానివ్వు. తప్పుతుందా?"

"మీ కసలు యిష్టంలేదులా వుంది. నేనేం చెప్పినా పుల్ల విరుపుగా యేదో ఒకటి మాట్లాడుతారు" కినుకగా అంది.

"నా కిష్టం లేదంటే..." నేనేదో అనబోతుండగానే, కాలింగ్ బెల్ మ్రోగింది.

శ్రీమతి నాతో తగవులాడే కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదావేసి తలుపు తెరవడానికి వెళ్లింది.

రెండు నిముషాల తర్వాత, ముఖం చిట్లిస్తూ తిరిగివచ్చింది.

"ఎవరో బ్రాహ్మణుడుట కూతురి పెళ్లికి సహాయం చెయ్యమంటూ వచ్చాడు. ఇదోరకమైన యాచన! రెండు రూపాయలిస్తాను, లేకపోతే వదిలేలాలేదు. తెల్లారిన దగ్గరనుంచి రాత్రి వరకు వెధవ ముష్టివాళ్లతో చస్తున్నాను విసిగిపోయి."

ఆమె ప్రతిపాదనను సమర్థిస్తున్నట్టుగా 'ఇదుగో' అంటూ జేబులో నుంచి రెండు రూపాయల కాగితం తీసి అందించాను. ఇంచుమించు ప్రతిరోజూ బస్‌స్టాండ్‌లోనో, ఆఫీసులోనో, ఇంటి దగ్గరో అలాంటి వ్యక్తులు చాలామందే తారసపడుతూంటారు నాకు.

తిరుపతి వెళ్తున్నామనో, బీదబ్రాహ్మణ యువకుడికి ఉపనయం చేస్తున్నామనో, పేద యువతి పెళ్లి అనో ఎవరో ఒకరు యాచనకు వస్తూనే వుంటారు.

తిరుపతి అనగానే దేముడంటే భయం వలనో, భక్తివలనో, దానం ఆనందంగా చేసే నేను చివరి యిద్దరికీ రూపాయి యిచ్చేచోట పదిపైసలు అయిష్టంగానే యిస్తాను. అదోరకమైన యాచన అని నా నమ్మకం.

చేతిలో రెండు రూపాయలతో వెళ్లిన శ్రీమతి పెద్దగా గొంతు పెంచి అరుస్తుంటే నిటారుగా అయ్యాను.

"మేం వందరూపాయలిస్తే దానితో మీ అమ్మాయి పెళ్లి అవుతుందా? పోనీ, వెయ్యి! రెండువేలు! ఆశకి కూడా అంతువుండాలి! ఇచ్చిన దానితో తృప్తి పడి వెళ్లండి."

ఆ వచ్చిన వ్యక్తి రెండు రూపాయలతో తృప్తిపడి వుండడు. నేను సీన్‌లోకి వెళ్లనిదే లాభంలేదనిపించింది.

ఏమిటంటూ వెళ్లాను.

ఎదురుగా మాసి, నలిగిన దుస్తులతో దైన్యం నిండిన ముఖంతో, మూర్తీభవించిన దారిద్ర్యంలా వున్నాడొక వృద్ధుడు.



శ్రీమతి ముఖంలో విసుగుదలకి ఆయన నొచ్చుకుంటున్నాడు.

"ఇష్టమైతే తీసుకోండి-లేకపోతే లేదు. మీ సొద వినే తీరక నాకులేదు" శ్రీమతి నిష్కర్షగా చెప్పేసి తలుపు వేసెయ్యబోయింది.

ఆయన దృష్టి నాపై పడింది. చేతులు జోడిస్తూ గాద్గదికంగా వున్న స్వరంతో అన్నాడు.

"బాబూ! తమరైనా నాపై దయ చూపండి, బీద బ్రాహ్మణుడిని, పిల్ల పెళ్లి కుదిరింది. నా భార్య మెడలో మాంగల్యం అమ్మి కట్నం డబ్బు ఎలాగో సమకూర్చుకోగలిగాను. మంగళసూత్రం చేయించడానికి, పెళ్లి ఖర్చుకి డబ్బు లేదు. రిజిస్టర్ మేరేజ్ చేసుకోమంటే వాళ్లు అంగీకరించలేదు. ఏదో మీకు తోచిన సహాయం చేస్తే కన్యాదాన ఫలం దక్కుతుంది."

ఆ ముఖంలోని దైన్యం తెచ్చిపెట్టుకున్నాడిలా, ఆ విషాదం నటనలా అన్పించింది నాకు.

"రెండు రూపాయిలు కాకపోతే, మరో రూపాయి తీసుకోండి" విసుగ్గా అంటూ మరో రూపాయి తీసి ఆయన ముందుకి జాపాను.

ఆయన నిస్పృహగా నిట్టూరుస్తూ అది అందుకుని, వెళ్లిపోయాడు.

"ఒళ్లువంచి కష్టపడనక్కర్లేకుండా డబ్బు సంపాదనకి యాచన సులువైన మార్గం అయింది అందరికీ" శ్రీమతి గొణుక్కుంటోంది.

నేను కోర్టుకి వెళ్లడానికి తయారవసాగాను. క్రిమినల్ లాయర్‌గా వూళ్లో పేరు ప్రఖ్యాతులార్జించిన నాకు పిత్రార్జితమైన మేడ, పల్లెలో పది ఎకరాల పొలం వున్నాయి. పట్టిన కేసులో విజయం తప్ప అపజయం ఎరుగని నాకు ఆదాయమూ పుష్కలంగానే లభిస్తోంది.